
కొంపల్లిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు


సూరారం డివిజన్‌లో.. ఎమ్మెల్యే వివేకానంద్, దళిత సంఘాల నాయకులు.


దుండిగల్ మున్సిపల్ పరిధిలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు


దేవేందర్‌నగర్‌లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత సాతాల గోపాల్



జీడిమెట్లలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బేక శ్రీనివాస్


సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నేతలు


పూలమాలేసి నివాళులర్పిస్తున్న బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్


జీడిమెట్ల గ్రామంలో నివాళి అర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి


సూరారంలో నివాళులర్పిస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


బాచుపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

# అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి

జయంతి సందర్భంగా ఘన నివాళి

భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని వక్తలు కొనియాడారు. సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పార్టీలు, సంక్షేమ సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలో హక్కులు, విధులు కల్పిస్తూ సమ సమాజ స్థాపనకు బీఆర్ అంబేడ్కర్ పాటు పడ్డారని, ఆయన కలల సాకారంగా రూపొందించబడ్డ రాజ్యాంగాన్ని గౌరవించి, ఆయన అడుగు జాడల్లో నడవాలని పిలుపు నిచ్చారు. -కుత్బుల్లాపూర్


అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కూన రాఘవేంద్రగౌడ్

## అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కంగారు పడొద్దు

- ఎమ్మెల్యే వివేకానంద్

**కుత్బుల్లాపూర్:** అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అగ్నిమాపక శాఖకు పూర్తి సమాచారం అందించాలని, ప్రజలు కంగారు పడకుండా బాధితులకు సహాయం అందించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక శాఖ వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వి.శేఖర్ రెడ్డి, ఫైర్ శాఖ సిబ్బంది డి.కరుణాకర్, డి.వీరోజీ, వి.కృష్ణ, డి.సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ


బస్టాప్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

**జీడిమెట్ల:** ఎండాకాలంలో మజ్జిగ పంపిణీ చేయడం వల్ల ప్రజల దాహార్తిని తీర్చవచ్చని ఎస్.ఆర్.నాయక్ అధ్యక్షులు అన్నారు. ఎస్.ఆర్ నాయక్ నగర్ బస్టాప్‌లో సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతిరోజు ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు దాతలు ముందుకు వచ్చి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించడం సంతోషంగా ఉందని నిర్వాహకులు అన్నారు.

## రాజ్యాంగంపై అవగాహన కల్పించాలి

**నిజాంపేట్ :** జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం 11వ రోజు నిజాంపేట్ గృహకల్పలోని 20వ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని అన్నారు. కార్యక్రమంలో కడియాల ఇందిరా, రఫియా, హర్యానాయక్, ఏనుగుల మధుసూదన్‌రెడ్డి, ఎలూరి సత్య, లింగాల గంగాధర్, ఎం.శ్రీనివాస్, కృష్ణమరాజు, వీరబాబు, నారాయణరెడ్డి, జె.మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున్, పితాని శ్రీనివాస్‌రావు, పంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## భానుడి భగభగ



**సుభాష్‌నగర్:** రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. మొన్నటి వరకు ఆకాశం మేఘావృతమై చల్లగా ఉండగా రెండు రోజులుగా ఎండలు పెరిగాయి. సోమవారం ఉష్ణోగ్రతలు మరింత పెరగగా సూరారం గ్రామానికి వెళ్లే దారిలో పాదాచారులు ఎండ తీవ్రతను తట్టుకునేందుకు తలపై ఇలా వేసుకుని వెళ్తుండగా సాక్షి కెమెరా క్లిక్ మన్పించింది.

# హద్దుల నిర్ధారణకు పడిగాపులు !

**భూవిస్తీర్ణంలో వ్యత్యాసాలు.. పెరుగుతున్న హద్దుల గొడవలు**

- భూ సమస్యలపై అధికమవుతున్న ఫిర్యాదులు
- సర్వే కోసం నెలల తరబడి ఎదురు చూపులు
- సిబ్బంది కొరతతో పేరుకుపోతున్న దరఖాస్తులు



భూసర్వేలో నెలకొన్న నిర్లక్ష్యం కారణంగా భూవివాదాలు అధికమవుతున్నాయి. ల్యాండ్ సర్వే కోసం అవసరమైన ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదుదారులు నెలల తరబడి ఎదురు చూడాల్సివస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సాక్షి,సిటీబ్యూరో :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ల్యాండ్ సర్వే ఏడీ పోస్టు ఖాళీ అయి.. ఆరు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు నియామకాల్లో జాప్యం కారణంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించటంతో దేనికి న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలు ఎదురౌతున్నాయి.

### అరకొరగా సర్వేయర్లు.. స్పందించని వైనం..

అరకొరగా ఉన్న సర్వేయర్లు కూడా సకాలంలో స్పందించకపోవటంతో భూవివాదాలకు సంబంధించిన దరఖాస్తులు వందల్లో పెరుగుతున్నాయి. దీంతో పలు సంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ భూయాజమానుల మధ్య భూ సరిహద్దు వివాదాలు పతాక స్థాయికి చేరుతున్నాయి.

- గ్రామాలు, పురపాలక సంఘాలు, బస్తీల్లో భూవివాదాలు సకాలంలో పరిష్కారానికి నోచుకోకపోవడంతో పోలీస్ కేసులు, గొడవల వరకు వెళ్తున్నాయి. మరోపక్క మండల, డివిజన్ రెవెన్యూ కార్యాయాలతో సహా జిల్లా ల్యాండ్ సర్వేశాఖలో ప్రతిరోజు భూసర్వేకు సంబంధించిన దరఖాస్తులు కుప్పలు, తెప్పలుగా పేరుకుపోవడంతో వారికి తలకు మించిన భారమవుతోంది.
- రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో సత్వర సమాచారం నిమిత్తం ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో భూసర్వే చేపట్టడం వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 18 మంది సర్వేయర్లు, నలుగురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్లు ఉన్నప్పటికీ భూసరిహద్దు వివాదాల పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఘట్‌కేసర్, బాలానగర్, శామీర్‌పేట, కీసర, మేడ్చల్, ఉప్పల్, కాప్రా, మేడిపల్లి, కూకట్‌పల్లి, దుండిగల్ తదితర మండలాలతో సహా పలు పురపాలకసంఘాలు, బస్తీల్లో పేరుకపోయిన భూ సరిహద్దు వివాదాలు తార్కాణంగా పేర్కొంటున్నారు.
- కొన్ని గ్రామాల్లోని భూ సరిహద్దు వివాదాలు ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీస్తున్నాయి. ప్రతి మండలంలో భూవివాదాలకు సంబంధించిన దరఖాస్తులు 40 నుంచి 50 చొప్పున వస్తుండటంతో జిల్లా పరిధిలోని 15 మండలాల పరిధిలో వందలాదిగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- కాప్రా మండలం మల్లాపూర్ డివిజన్‌లోని గోకుల్‌నగర్‌కు చెందిన సుబ్బారావు అనే వ్యక్తి భూసర్వే కోసం సంబంధిత ఫీజులన్నీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, జనవరిలో దరఖాస్తును కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అందజేశారు. ఇప్పటి వరకు పరిష్కారానికి నోచుకోకపోగా.. ఎలాంటి సమాచారం కూడా ఇవ్వలేదు. ఇలాంటి భూసర్వేకు సంబంధించిన దరఖాస్తులు నగర జిల్లాలలో వందలాదిగా పేరుకుపోయాయి.
- ఒక్కో భూ సర్వే దరఖాస్తును 45 రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ ,4-5 నెలలు గడుస్తున్నా.. దస్త్రాలు ముందుకు కదలకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు భూవివాదాలపై కొన్నిసార్లు ఇరువర్గాలు స్పందించకపోవడం, పంట పొలాలు సాగులో ఉండటం, సిబ్బంది కొరత వంటి కారణాలు వల్ల భూసర్వే సకాలంలో పూర్తి చేయలేకపోతున్నామన్న వాదనలు కూడా అధికార వర్గాల నుంచి లేకపోలేదు. ఈ జాప్యంపై అధికార యంత్రాంగం సత్వరమే స్పందించి, న్యాయం చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

## 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఫైర్‌సేఫ్టీ అధికారి తదితరులు

**కూకట్‌పల్లి:** అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఈ వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండలు తీవ్రంగా ఉండే ఈ రోజుల్లో అగ్ని ప్రమాదాలు జరుగకుండా అన్ని దుకాణాల సముదాయాలు, ఇళ్లు, స్కూల్స్, హాస్పిటల్స్ వంటి ప్రాంతాల్లో తప్పకుండా ఫైర్‌సేఫ్టీని పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ప్రజలందరూ కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ జగన్‌మోహన్, లచ్చిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో..

**కేపీహెచ్‌బీకాలనీ:** జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ టి. జగన్‌మోహన్‌తో కలిసి వీసీ డా. టి. కిషన్ కుమార్ రెడ్డి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఫైర్‌సేఫ్టీ అధికారి జగన్‌మోహన్ మాట్లాడుతూ.. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ప్రాక్టికల్ డెమోలు, అగ్నిమాపక సాధనాల ప్రదర్శనలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అగ్ని ప్రమాద పరిస్థితుల్లో తక్షణ చర్యలు, భద్రతా నియమాలపై సమాచారాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డా. కె. వెంకటేశ్వరరావు, ఫైర్ స్టేషన్ అధికారులు, విశ్వ విద్యాలయ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ కిషన్ కుమార్ రెడ్డి, ఫైర్‌సేఫ్టీ ఆఫీసర్ టి. జగన్‌మోహన్

## ఇంటి తాళం పగలగొట్టి చోరీ


చిందర వందరగా పడేసిన వస్తువులు

**దుండిగల్:** ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న ఆభరణాలను దోచుకెళ్లిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బహదూర్‌పల్లి ప్రాంతానికి చెందిన తిరిక్కవల్లూరి శ్రీక్రాంత్ ఈవెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. సమీపంలోనే ఉంటున్న తన అత్తగారి ఇంటికి ఈ నెల 13వ తేదీన కుటుంబంతో కలిసి వెళ్లాడు. తిరిగి 14న ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాలోని మూడు బంగారు ఉంగరాలు, మూడు వెండి పట్టీలు, ఒక సెల్‌ఫోన్, కొంత నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా వీరి ఇంటి పక్కనే పెళ్లి ఇంట్లో సైతం దొంగలు కొన్ని వస్తువులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. కానీ వారు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

## ఐఎన్‌టీఎస్‌ఓలో సత్తాచాటిన దూలపల్లి విద్యార్థులు

**కుత్బుల్లాపూర్:** ఇండియన్ నేషనల్ టాలెంట్ రీసెర్చ్ ఒలంపియాడ్ రెండవ లెవల్ పరీక్షలో దూలపల్లి బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కొంపల్లి జోన్ ఏజీఎం జీవీ రమణారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇటీవల 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా శ్రీ చైతన్య దూలపల్లి విద్యార్థులు ప్రతిభను చాటారన్నారు. గ్రాండ్ ప్రైజ్‌గా బోడ రేణుక ల్యాప్‌టాప్ పొందారు. మొదటి బహుమతి భవిక కిరణ్, ఆర్తి కుమారి యాదవ్ ట్యాబ్, మూడవ బహుమతి భాను ప్రియా, సాహితి ప్రజ్ఞ స్మార్ట్ వాచ్ గెలుచుకున్నారు. ప్రత్యేక బహుమతులు 8, కంసొలేషన్ ప్రైజ్ 59, మెడల్స్ 99 సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ భావన, హేమలత, జోన్ కో ఆర్డినేటర్ రవి, జోన్ ఆర్ఐ చక్రి, డీన్ శ్రీహరి, సీఅండ్ఎం ఇన్‌చార్జి కృష్ణం రాజు, ఎంపీఎల్ ఇన్‌చార్జి త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న రమణారావు

## రాజ్యాంగం వల్లే అందరికీ స్వేచ్ఛ


ర్యాలీలో ఎంపీ రాజేందర్ తదితరులు

**కుత్బుల్లాపూర్:** భారత రాజ్యాంగ నిర్మాతగా దేశ ఔనత్యాన్ని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని, అయన రూపొందించిన రాజ్యాంగం వల్లే అన్ని కులాలు, మతాల వారు స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సతీష్ సాగర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కొంపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రాజిరెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, భరత సింహారెడ్డి, జనార్దన్ రెడ్డి, పొత్తూరి శివాజీ రాజు, జోగిని రాజు, విజయేందర్ రెడ్డి, మణికంఠ, పీసరి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పనులు ముగిసినా సీసీ వేయరా?

**రంగారెడ్డినగర్:** అభివృద్ధి పనుల కోసం సీసీ రోడ్డును తవ్వి పునరుద్ధరించకపోవడంతో ఆరు నెలలుగా ఆ గల్లీ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఇందిరాగాంధీ నగర్‌లోని పోచమ్మ ఆలయం వెనుక గల్లీలో భూగర్భ డ్రైనేజీ లైన్ కోసం జల మండలి ఆధ్వర్యంలో తవ్వకాలు చేపట్టి పనులు పూర్తి చేశారు. రోడ్డును పునరుద్ధరించాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇంకెన్ని రోజులు సీసీ రోడ్డు కోసం వేచి చూడాలని బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## బౌరంపేట్ లో పశువుల చోరీ

**దుండిగల్:** పశువుల కొట్టంలో నుంచి నాలుగు పశువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బౌరంపేట గ్రామానికి పర్ష యాదగిరి యాదవ్ పాడి పశువులను మేపుతూ పాలను విక్రయిస్తు జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే తన పశువుల కొట్టంలో ఈ నెల 13వ తేదీన రాత్రి వాటిని కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి 14వ తేదీన ఉదయం వచ్చి చూసేసరికి కొట్టంలో ఉన్న మూడు ఆవులు, ఒక గేదెను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తాగునీరు సరఫరా చేయాలని ధర్నా

**మూసాపేట:** భరత్‌నగర్ కాలనీలో మూడు రోజుల నుంచి మంచినీటి సరఫరా రావటం లేదని కాలనీ వాసులు సోమవారం ధర్నా నిర్వహించారు. వారం రోజులుగా కాలనీలో మంచినీటి ప్రధాన లైన్ పనులు జరుగుతున్నాయి. కాలనీలోకి వెళ్లే వాటర్ లైన్ మూడురోజుల క్రితం పగిలింది. మూడు రోజుల నుంచి మరమ్మతులు చేయకుండా కాలనీలకు నీరు వదలటం లేదు. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీలలోని కొన్ని వీధుల్లో తాగడానికి కూడా మంచినీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికీ ప్రజలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందించటం లేదు. నీటి సరఫరాలో సమస్య ఉన్నప్పుడు ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలని స్థానికులు ధర్నా నిర్వహించారు. ఆదివారం కూడా ధర్నా చేశామని, వాటర్‌వర్క్స్ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. పగిలిన పైపులైన్ మరమ్మతులు చేసి నీటిని అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అభిలాష్ యాదవ్, స్వామి, మంజునాథ్, విశ్వనాథ్, మహేష్, నరేష్, సుహాసిని, సంధ్య, రవి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

